# మరో సారా కథ

కార్మిక

మా అయ్య సారా తాగి తాగి సచ్చిండు. చావకముందు మా అయ్య బొగ్గు బాయిల పన్జేసెటోడు. బాయి పనికి పోయిరాంగనె వచ్చేటప్పుడె సవ్వో దోసవ్వో సారాతాగి ఇంటికొచ్చెటోడు. ఎప్పుడైనా పైసలులేక తాగనిరోజు, కాళ్ళుపాయె చేతులుపాయెనంటు కొట్టుకోలు మొత్తుకోలు చేసెటోడు. చివరికి అట్లనో ఇట్లనో చేసి కొని పొయ్యి ఓ సవ్వ ఏసుకొని మళ్ళి మామూలు మనిషైపోయెటోడు. రాను రాను తాగుడెక్కువై జీతం మొత్తం తాగుడుకె పోయేది. అంతటితో ఆగిపోలె చివరికి ఇంట్లోదొరికిన ప్రతి వస్తువు తీస్కపోయి అమ్ముకొని తాగెటోడు. మా అవ్వ ఎంత మొత్తుకున్నా వినెటోడుకాదు. పైగా తాగొచ్చి గొడ్డును బాదినట్టు బాదెటోడు. చివరికి తాగి తాగి కార్జాలు తూట్లుపడి బొక్కలెల్లి మొఖమంతా వాసిపోయి పెయ్యంతా పచ్చ బడి సచ్చిపోయిండు.

అట్ల మా అయ్య సచ్చిపోయినకాన్నుంచి మాఅవ్వ అందిన కష్టమల్లజేసింది. కూలినాలి చేసింది. ఒక్కపూటతిని మరోపూట తినకుండా మాకు పెట్టింది. నాకప్పుడు తొమ్మిదేండ్లు. నాల్గేండ్ల చెల్లెలొక్కతి ఉండేది. అది ఆ తర్వాత ఏదో రోగంతోని నాల్గురోజులు మంచంల పడి సచ్చిపోయింది. నేను ఒక్కన్నె మిగిలిన.... నేనింత పెద్దోన్ని అయి రెక్కలు ముదిరి సంపాదించక పోతనా అన్న ఆశ ఒక్కటి మాత్రి

---

తుంటుంది). 'బండెడు అబద్ధాలలో చిటికెడు సత్యాన్ని' చూడగల శక్తిని అలవర్చుకోవాలి. అందుకు తోడ్పడే ప్రత్యామ్నాయ పత్రికలను అభివృద్ధి చేసుకోవాలి. ప్రస్తుతం మనదేశంలో ఇంచుమించు అన్ని భాషలలోనూ ప్రత్యామ్నాయ పత్రికలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా ఈ రంగంలో ఉన్న రెండు ఇంగ్లీషు వార పత్రికలు (ఫ్రాంటియర్, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ) గణనీయమైన సేవ చేస్తున్నాయి. ఈ రకం పత్రికలకు వార్తలనందించడంలో, ప్రమాణాలను పెంచడంలో, పాఠకుల సంఖ్యను ఎక్కువ చేయడంలో తోడ్పడాలి.

'బండెడు అబద్ధం కంటే చిటికెడు సత్యం కలిసిన అబద్ధం' ఎక్కువ ప్రమాద కరమయింది.

— డాస్టోవ్‌స్కీ

ముండేదికావచ్చు మా అవ్వకు. కాని నేను బుద్ధిఎర్గసరికి మాఅవ్వకూడ మిగలలేదు. సరిగా తిండి తినక పేగులు మాడ్చుకొని సచ్చింది. నాకప్పుడు పన్నెండేల్లు. ఎటూ దిక్కులేని నన్ను మా అవ్వ పెద్దతల్లి కొడుకు తీస్కపోయి ఇగ్గో గీ సారా కొట్ల నౌకరుంచిండు. అగో అప్పడినుండి ఇదే సారాకొట్లా సారా తాగిన గిలాసలు కడుగుతు, సారా తాగేవారికి ఫలహారాలందిస్తు వాళ్ళిచ్చిన పావులా పర్కా తీసుకుంటు కాలము గడుపుకుంటు వస్తున్నా నాకిప్పుడు ఇరువైరెండేళ్ళు.

నేను ఈ సారాకొట్లో పన్జేస్తున్నకాన్నుంచి సారా తాగెటోల్లను చూస్తున్న. ఒకొక్కళ్ళను చూస్తె నాకు అసహ్యం పుట్టేది. మరి కొందరిని చూస్తే జాలికల్గేది. క్రమం తప్పకుండా సారా దుకాణం వచ్చేవారు. ఎప్పుడు సారా నిషాలోనే కాలం గడిపెటోళ్ళు. కొత్తగా తాగేటోళ్ళు, ఇంకా మీసం పొడవని కురాల్లు. గోసిపేల్లెలోల్లు పొద్దుందాక మొద్దుకష్టం చేసెటోళ్లు. బొగ్గుబాయిల్ల బండపని చేసెటోల్లు ఇలా రకరకాల వ్యక్తులను రోజు చూస్తుండేవాడిని. క్రమంగా ఒక్కరొక్కరె సారా బానిసలై పోయేటోళ్లు. పొద్దుగూకెదాక రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన దాంట్లో సగం కూలి సారాకొట్లోనె ఖర్చు చేసెటోల్లు. సారాకొట్లోకి వచ్చేటప్పుడు ముక్కుతు మూల్గుతు అలసిపోయి వచ్చినవాళ్ళు గుటుక్కున పావో రెండు పావులో మింగి ఒక్కసారి ఒళ్ళు జలదరించుకొని సారా ఘాటుకు తుపుక్కున ఊంచుతు సారా మత్తు తలకెక్కేసరికి 'బంచెత్ నా అంతటోడు లేడంటు బొచ్చె ఉబ్బిచ్చుకుంట బయటికి వెళ్ళిపోయెటోళ్లు. అంతకుముందు ఒక్కమాట మాట్లాడనివాళ్లు అంతుపొంతులేని సంభాషణలు సాగించెటోళ్లు. ఒక్కొక్కరు ఏ కారణం లేకుండానె బోరున ఏడ్చెటోల్లు, నాకిదేమి అర్థమయ్యేది కాదు. ఒక్కొక్కసారి అనిపించేది అసలు వీళ్లె తాగటానికి ముందు గుసుసుకుంటు వచ్చిన మనుషులేనా అని కొద్ది క్షణాల్లో ఎంత మార్పు. ఏదో బ్రహ్మరాక్షసి వాళ్ళను సారా సుడిగుండంలో పడేసి పీల్చి పిప్పి చేస్తుందనిపించేది కాని అదేంటో నాకు అర్థమయ్యేది కాదు.

దసరాపండుగొచ్చింది కొత్త మాములాలొచ్చినయి. ఇదివరకున్న సేటుపోయి కొత్త సేటువచ్చిండు. మాతాలూకాలోని సారాపాట పన్నెండులక్షలనుండి పద్దెనిమిది లక్షలకు పెంచిపాడిండు. కొత్తగావచ్చినసేటు. అంత పాటపాడినసేటుకు పత్త లేమి మిగల్తదో నాకు అర్థంకాలె. ఖర్చు తగ్గించుకోవటం కోసము పాతోల్లను తిసెత్తాడెమో

నని బయపడ్డాను. కాని నా భయం వృత్త భయమేనని తేలిపోయింది. కొత్తసేటు వచ్చినకాన్నుంచి పాత పద్ధతులన్ని మారిపోయినయి. కొత్తగా పన్నెండు మంది వస్తాదుల్లాంటి మనుష్యులు పనిలకు కుదిరిండ్లు. మరెండు కొత్తజీబులు ఒక లారి వచ్చినయి. గా కొత్త జీబు వచ్చినప్పుడె గా జీబులా మా కొత్తసేటు వచ్చిండు. గప్పుడె ఆయన్ని చూడటము మళ్ళెప్పుడు ఆయన్ని చూడలేదు. ముప్పయి ముప్పయి అయిదు ఏండ్లుండవచ్చు. చిదుముతె రక్తంకారేలాగున్నడు. షోగ్గా పెంచుకున్న మీసాలు పెదవులకింద వాలి ఉన్నాయి. మల్లెపువ్వులాంటి తెల్లటి బట్టలల్ల దొర తీర్గ ఉన్నడు ఆయన గురించి మావోల్లు ఆ తర్వాత చానా చానా చెప్పిండ్లు. వయసుకు చిన్నోడె అయినా చాల తెలివైనోడు. చాల కష్టపడి పైకొచ్చిండ్లన్నరు. కష్టం గుర్తెరిగి నోడన్నరు. అంతేకాదు ఆయనొకప్పుడు పెద్ద నక్సలైటట కూడా. ఏమైతేం గాని ఆయనొచ్చినప్పుడు మా డిపోల పెద్ద దూడావుడి జర్గింది. ఆ తర్వాత నేను అక్కడ పన్జేసినన్నాల్లు మల్ల రాలేదు. ఆయన తరపున అన్ని వ్యవహారాలు ఆయన మనుష్యులు చూస్తుండెటోల్లు. ఆ తర్వాత డిపో రూపమే మారిపోయింది.

గోదావరిఖనిలో వాడవాడకు సారాయి దుకాణాలు వెల్సినయి. మరీ సెంటర్‌లో మూడు పానాదులుకాడ్నయితె పదిగజాలకో షాపు ఓపెన్ చేసిండ్లు. మరిన్ని దుకాణాలకు సారా సప్లయి చేయాలంటే గవర్నమెంటు ఇచ్చిన కోటా ఏ మూలకు సరిపోతుంది? నెలలో ఒక వారము కూడారాదు. అందుకే మా శేట్ దొంగతనంగ అల్కాహాల్ తెచ్చి సారా చేయించి అమ్మించేవాడు.

ఒక్కసారి రాత్రి రెండింటి దాక పన్జేసి అప్పుడె ఓ కునుకు తీస్తున్న అరె సారిగా లె లె. లేసిపోయి జీబులెక్కు అంటూ నేకప్పుకున్న గోనెతట్టును లాగేస్తుండ్లనరో. లేచి కూచున్నాను. నాఎదురుగా గుబురు మీసాలతోని పొట్టిగా లావుగా ఉన్న అవిశెట్టి కన్పించిండు. 'తొందరగా పో. రెయిడింగ్‌కు పోతండ్లు. బలె మజావస్తదిలె' అంటు ఇంక ఏదో వాగుతూనె ఉన్నడు. అలా వాగినప్పుడు. అతని వడ్డి ముక్కును గుబురు మీసాలు కప్పేస్తున్నయి లోతైన చిన్నకండ్లు మరింత మూసుక పోయినయి.

లేచి పోయి జీబులోకూసున్న, నేనెంత సారాకొట్లో పన్జేసెటోన్నయినా ఆ జీబులో కూసునే సరికి తల తిరిగినంత వసయింది. జీబులో ముందు సీట్ల నల్గురు వెనుక వైపున

నల్గురు ఎక్సయిజ్ కానిస్టేబుల్స్ కూసున్నారు. అంతపూటుగా తాగి ఉన్నారు. ఆ జీబు మొత్తం చమటతోని బన్న బన్న కాలుస్తున్న సిగిరెట్టు బీడి పొగలతోని సారా కంపుతోని చిరు చిరులాడు తుంది.

జీబు కదిలింది రోడ్డుమీద అడ్డంగా పరిగెడుతు. ఆలా కొద్దిసేపు ప్రయాణం చేసిన తర్వాత జీబు రోడ్డుదిగి బండ్ల బాటంట తుప్పలు బోడులు దాటుకుంటు చివరికో పల్లెను చేరుకుంది. అప్పటికింకా చీకటితొల్గిపోలేదు. తూర్పుకు పంగినయి అప్పుడె విచ్చుకుంటున్న సందెవెల్గులు ఊరుకో అస్పష్టమైన ఆకారాన్నిస్తున్నాయి, ఊర్లోకి చేరుకునే మూలమలుపుకాడ పెద్ద మర్రిచెట్టుంది. ఆ మర్రిచెట్టు నీడల జీబు ఆపిండ్లు. జీబులైట్ల వెలుగులో హిప్పిజుట్టు పెంచుకున్న దౌడలు పీక్కబోయిన అతను మా జీబుకోసమే చూస్తున్నట్టుంది. జీబుకాడికొచ్చి 'ఇంత ఆలస్యం అయిందేంసార్ మీరు వస్తారో రారోనని చూస్తున్నా'.

"వస్తాం అన్న తర్వాత అరుసూరైనా రావటం రావటమే" అన్నాడు మా జీబులో ముందుకూసున్న సంజీవరావు అతనే ఇటువంటి రైడింగులకు నాయకత్వం వహించేది' అతనిపక్కన కూచున్న ప్రకాశ్ 'ఇంతకు ఇక్కడ దొంగసారా కాసె ఇండ్లెన్ని ఉన్నాయి. ఎక్కడెక్కడున్నాయో అన్ని వివరాలు తెల్సా"

ఆ చీకట్లో ఒకసారి బైరు పంచరైనట్టు కిసుక్కున నవ్విండు సంజీవరావు, ఇంకా నవ్వుతూనే 'గామాత్రం తెల్సుకోకుండా వస్తామటయ్యా.'

'అంతా నాకెరుకెసార్ మీరు బయలుదేరటమే ఆలస్యం' అన్నడా యువకుడు అతి వినయంగా.

'వెనక్కిపోయి జీబెక్కు' సంజీవరావు ఆ యువకున్ని ఉద్దేశించి అన్నాడు. ఆ యువకుడు జీబు వెనక్కి కదిలిండు 'మొత్తానికైతె నీ చేతులు అన్నివైపులున్నాయి ఇంతకీ కుర్రాడెవరు' ప్రకాశ్.

"నాల్గు డబ్బులు మనయి కావనుకుంటె కొండమీద కోతైనా దింపవచ్చు దందా నడిపెకాడ పైసలకు ఎన్కముందు చూడద్దు పని అయేదెట్లా అని ఆలోచించాలి" సంజీవరావు.

జీబు మళ్ళి బయలుదేరింది. ఊళ్ళోకొచ్చిన తర్వాత రెండు పానాదులు వచ్చినయి. ఎటుపోవాలో అర్థంగాక డ్రైవర్ వెనక్కి చూసిండు. 'లెఫ్ట్‌పోనియ్' అన్నాడు ఇందాకటి యువకుడే. జీబు కాపువాడ కొచ్చింది.' అగ్గో నాల్గో నెంబరు ఇల్లె' అన్నాడా యువకుడు జీబు దిగకుండానె.

'దిగు' సంజీవరావు.

'అమ్మో మీరివ్వాల మీ పని చూస్కోని పోతరు. తెల్లారిలెస్తే ఈ ఊర్ల బతికెటోన్ని వాళ్ళ కంటపడ్తె బతకనిస్తరా' అన్నాడు భయంగా.

"తూ పిరిగిగొడ్డు మేంలేమురా నీమీద ఈగవాలనిస్తాంరా ఎవడన్నా ఎదురు తిరిగితె లంజకొడుకుల చెమ్డాలు ఊడతియ్యంరా" ప్రకాశ్.

ఆ యువకుడు జీబు దిగిండు.

అప్పటికి సందెల్గులొచ్చినయి. ఊరు నిద్దురమత్తు ఇంకా వీడిపోలేదు గా యాలప్పుడు మా రేడింగ్ మొదలయింది. ఊరుఊరంత గెబ్బడపాలయింది. కుండలు పగిలినయి. అందినోల్లను అమురకవచ్చి చావబాదిండ్లు మొదట కాపువాడ ఆ తర్వాత మాలవాడలనొచ్చి అక్కడ అదె జర్గింది. ఈ అటావిడంత మూడుగంటలు సాగింది. నాల్గు కుండలు, రెండు కాన్లు ఒక మోటారు టైర్ల స్టాక్‌జేసిన సారా దొరికింది. ఉత్త త్తోల్లను వదిలిపెట్టి చివరికి నల్గురు మొగోల్లను, ఓ ముసల్దాన్ని, మరో పడుచమ్మాయిని తీసుకొని వచ్చిండ్లు. అమ్మాయి ఇంట్లో చిన్న ప్లాస్టిక్‌డబ్బాలో నాటుసారా దొరికింది. ఇంట్లో తల్లి దండ్రిలు లేరు. వాళ్ళ వాళ్ళెవరో చనిపోతె ఊరెల్లారని తెల్సింది.

వాళ్ళందర్ని తీసుకొని అడ్డకాడికొచ్చినం. మా గోదాంలోని లాకపు రూంలో వేసి ఇర్గగొట్టిండ్లు. వంతులవారిగా గుద్దిండ్లు. "నీబాంచెను ఇంకెప్పుడు గీ తప్పుడు పని చెయ్యం- నీ పియ్యి తింట, నీ కాల్మొక్కత" అంటు దీనంగా అరిచెటోల్లు. కాని వాళ్ళ మాటలెవరు వినెటోల్లెకాదు. 'లంజకొడుకుల్నందర్ని పెట్రోలుపోసి తగల బెట్టినా పాపం లేదు' అంటు మా సార్డీపో మేనేజరు హనుమంతరావు కోపాని కొచ్చెటోడు.

అందర్ని కొట్టినా గా పడుసమ్మాయి మీద చెయ్యెవరు వేయలేదు ఆ అమ్మా యిని తీసుకొచ్చినకాంచి ఒకటె ఏడ్పు. కాని అదేమి పట్టించుకోకుండా పిటపిటలాడు తున్న ఆ అమ్మాయి రొమ్ములకేసి, పిర్రలకేసి ఆశగా చూసెటోల్లు.

ఆ మరునాడు సాయంకాలము ఆ అమ్మాయిని మా మేనేజరు హన్మంతరావు దొరుండె విశ్రాంతి గదిలకు గుంజుకపోయిండ్లు. లోన అరుపులు పెడబొబ్బలు అంత కంతకు క్షీణించినయి. సినిమాల్లో అయితె అటువంటి సీన్లల్ల గిలాసలు పగిలిపోయి నట్టో, లేడిమీద పులిదుమికినట్టో చూయిస్తరు. సరిగ్గా గట్లనె మూసున్న మా మేనేజరు గదిముందు కాసాయ బట్టలేసుకొని నొసట తెల్లబొట్టు పెట్టుకొని దొంగనవ్వు నవ్వు తున్న ఎంటిగాని బొమ్మ కన్పించింది. మా దొర తెల్గుదేశంలో చేరినకాన్నుంచి గా బొమ్మ గక్కడ వేళ్ళాడుతుంది.

కాసేపయిన తర్వాత సంతృప్తిగా నవ్వుతు మా మేనేజరు దొర బయిటి కొచ్చిండు "ఓరె సంజీవా నువ్వుకూడా ఓ ఛాన్స్ చూస్కోపోరా షిరబండి...." అంటు అదే దొంగనవ్వు నవ్వుకుంటు వెళ్లిపోయిండు దొర.

సంజీవడు అనే సంజీవరావు మేనేజరు గదిలోకెల్లి తలుపు మూసుకున్నడు. ఆ దొంగ లంజకొడుకుల గొంతులు కసుక్కున కొరికేయాలనిపించే పిచ్చి కోప మొచ్చి అక్కడీసుండి ఎవరికి చెప్పకుండా ఇంటికొచ్చి పిచ్చిలేసినోనితీర్గ ఊరంత తిర్గిన.

రెండురోజుల తర్వాత పట్టుకొచ్చినోల్లందరిమీద ఎక్సయిజ్ చట్టముప్రకారము దొంగసారా కాసినదాని కింద కేసు బుక్ చేసిండ్లు. ఆ అమ్మాయిని మాత్రం వాళ్ల తల్లిదండ్రులు బతిలాడి బొమాడి 450 రూపాయలు జుల్మానా చెల్లించి విడిపించుకొని పోయిండ్లు.

* * * * *

గిదంతా జర్గుతున్నా ఎవరేం పట్టించుకున్నట్టులేదు. సారా ధర సౌకు 3-20 నుండి 4 రూపాయలు పెరిగింది. అయినా తాగెటోల్లు తాగుతనే ఉన్నరు. దొడలు తీపులు పెట్టినోడు, వొళ్ల నొప్పులు పెట్టినోడు, బాధలుపడెటోడు, బతుకులెల్లనోళ్లు, అదే లేబరోల్లు, కూలోల్లు, మట్టీకొట్టుకపోయిన మొఖాలు వణికె చేతులతో వచ్చి తాగుతూనే ఉన్నారు. వాళ్ళను చూస్తుంటె మానాన్న గుర్తుకొచ్చెటోడు. వాళ్ళపెళ్లాం పిల్లల ఏడ్పులేవో వినిపించేవి. నా మనసంత కుతకుతలాడేది.

అగ్గో గటువంటి సమయంల ఓ బందురోజునాడు మా వాడలున్న జనమంత పోగయిండ్లు. ఏంటో తెల్సుకుంటామని అక్కడికి పోయిన. పాతిక సంవత్సరాల వయస్సుండే యువకుడొకడు ఏదో వాళ్ళకు చెపుతున్నడు.

"....మనల్ని తాగుబోతులను చేసి పిచ్చి తాగుబోతులుగా ఉన్మాదులుగా చేసి సంసారాలను నాశనం చేస్తున్నారు. మన రెక్కల కష్టం, మన రక్తం మనకు దెంద కుండా చేయటమే కాదు మన బుర్రలు మనవి కాకుండా చేస్తున్నారు. ఆ తాగుడు మైకంలో పడ్డ మన సోదరులు పెండ్లాం పిల్లల అన్నమో రామచంద్రా అంటూ ఆకలి చావులు చస్తున్నారు. కాయకష్టం చేసెటోడు తమ బాధలను కాసేపు మరిచిపోవటము కోసము మహమ్మారిలాంటి సారాకొట్టుకు పోతాండు. అలా మొదలుపెట్టినవాడు చివ రికి అది లేకుండా బతకలేని స్థితికొస్తున్నాడు. ఎన్నో వేల సంసారాలు ఈ సారా చేయబట్టి నాశనమౌతున్నాయి. ఎందరో పిల్లలు అనాథలవుతున్నారు."

"అవుబిడ్డా ఉన్నమాట చెప్పినవు" మొఖం ముడుతలు పడ్డ స్త్రీ మధ్యలో కల్గ జేసుకొంది.

"తాగుడుకు బానిసలైన జనం బలహీనతను పెంచి పోషించటమేకాదు. ఆ బల హీనత ఆధారంగా చేసుకొని డబ్బు సంపాదించేందుకే దోపిడీదారులైన కంట్రాక్టర్లు వాళ్ళకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అందుకే ఈ దోపి డీకి వ్యతిరేకంగా మనం పోరాటం చెయ్యాలి. పెంచిన సారా రేటు తగ్గించాలని మనమంత ఒక్క కట్టు పోరాడాలి". జనంలోకి చూసాడతను.

"ఏమోనబ్బా తాగుబోతోల్లు తాగకుంటా ఆగుతారా నాకు అనుమానమే" మం దిలో నుండి ఎవరో గొణిగినట్టున్నరు. "ఎందుకాగరు, అగనోని నోట్లెంత ఉచ్చ పొత్త తూ( షరాలులేని బతుకు" తలంతా చెదిరిపోయిన ఆమె కోపంతో అరిచింది.

కాసేపు అల్లరల్లరిగా మాట్లాడుకున్నారు. ఎవరిమాట ఎవరికి వినబడలేదు.

చివరగా అందరు బందంటె బందన్నరు అట్లా సారా పోరు మొదలయింది.

అదిగో ఆ సమయంలనె మావాడలోఉండే చలమయ్య సారుకూడా ఓ మీటింగ్ పెట్టిండు. 'సారాదర తగ్గేంత వరకు పోరాటం ఆపద్దు' అంటు చాల చాల చెప్పిండు. ఆయన మాటకు మా వాడల కొంత పలుకుబడి ఉంది. ఆయనకూడా పోరాటంలో కల్సి వచ్చేసరికి అందరికి సంతోషమైంది.

సారా కొట్లన్నిమూతలు పడ్డయి. సారా కొట్ల ముందు పోలీసులు తప్ప జనం ఎవరు పోవటములేదు. అటువంటి సమయంలోనె నేను నా సారా పని మానుకున్నా. నాకెందుకో తలమీద బరువు దించేసినట్టయింది. ఇన్నిరోజులకు నేను మంచిపని చేసే నన్న సంతృప్తి మిగిలింది. నేను సారా పోరాటం చేసెటోల్లతోనే కల్సిపోయిన. దొంగసాటుగా సారా ఎట్లా అమ్ముతారో నాకు అనుభవముంది. సారా డిపోలలో కాకుండా ఇండ్లల్లో పెట్టి చాటుమాటుగా అమ్ముతరు. అగో అటువంటివికూడా బంద్ చేయాలనుకుని అట్లాగే సేసినం.

"బేకులబస్తీలో మూడవనెంబర్ డిపో తెరిచి సారా అమ్ముతండ్లు" పకీరయ్య ఎగబోసుకుంటు వచ్చి చెప్పిండు.

"అన్ని దుకాన్లు బంద్ పెట్టియ్యాలె"

"అక్కడ పోలీసులున్నరు"

"ఉంటె ఉండనియ్యి చంపుతారా చంపనియి"

లంజాకొడుకులను సారా అమ్మకుంట చెయ్యాలి

'పద అంటె పద అనుకున్నరు.

నిముషాలమీద వందలమంది పోగయి మూడవ నెంబర్ సారా డిపో కేసి కదిలిండ్లు. అంతమంది కలిసిపోతాంటే ఏం జరిగిందో చూద్దాం అని వచ్చినోల్లు, ఇంకొంతమంది కలిసి మొత్తానికైతే ఐదారువందల మంది పోగయిండ్లు. అప్పటికే సారాడిపోలో ఉన్న నల్గురు పోలీసులు అంత మందిని చూసేసరికి బెదిరిపోయిండ్లు. వాళ్ళేమి ప్రతిఘటించలేదు. గిదగిద ముందుకొచ్చినోడు పోలీసు కౌంటర్లో కూసున్న తపితో వాదానికి దిగిండు. మరెవ్వరో 'చూత్తండ్లేందిరా వాన్నిట్టు గుంజుండ్లె' అని అరిచిండు. మరొకడెవడో సారాబాడీలను లేపి నేలమీద విసిరిండు. పది నిమిషాల్లో ఆ కొట్లో ఏం మిగలలేదు. ముందేమి జరుగుతుందో ఎనక ఉన్నవారికి తెలియనేలేదు.

అంతలకె అదనపు పోలీసులు గాలిలో కాల్పులు జరుపుకుంటూ వచ్చిండ్లు. దాంతో జనం తలోదిక్కున పారిపోయిండ్లు. ఏదో కొద్దిమందిని దొరకబుచ్చుకొని పోలీసులు పోయిండ్లు.

అది జరిగిన నాల్గు రోజులదాకా పోలీసులు ఇండ్లల్లకు సొచ్చి అందినోల్లల్ల పట్టుకపోయిండ్లు. కొద్దిమంది దెంకపోయిండ్లు. అటువంటి సమయాలనే 'సారా ధర తగ్గించిండ్లట' అన్న పుకార్లు పుట్టినయి. గా పుకార్లు నిజమేనన్నట్టుగా మా వాడలో చలమయ్యసార్ ఓ మీటింగ్ పెట్టిండు "మన పోరాటం విజయవంత మైంది. సారా ధర తగ్గించేందుకు సారా కంట్రాక్టర్లు ఒప్పుకున్నరు ఒప్పందంకూడ కుదిరింది. మనం పోరాటాన్ని విరమించాలి"

అక్కడ పోగయిన జనం ఒక్క క్షణం ఆశ్చర్యంలో మునిగిపోయిండ్లు.

ఓ బొక్కినోరు ముసలోడు తొస్సు తొస్సుమంటు 'ఎంత తగ్గించిండ్లట బాంచెను' అడిగిండు. "లీటరుకు రూపాయి తగ్గిస్తామన్నరు" అందరివైపోసారి పరీక్షగా చూసి "అంటే సౌకు పది పైసలు తగ్గిస్తామన్నరు"

"ఆవుబాంచెను గొప్ప విజయం సాధించుకొచ్చిండ్లు" ఇందాకటి ముసలోడే మల్లి అసహనంగా గునిగిండు.

చలమయ్యసారు అదేం పట్టించుకోకుండా మల్లి చెప్పటం మొదలుపెట్టిండు. 'మనముందున్న పరిస్థితులు ఎంత విషమంగా ఉన్నాయో ఎంత తీవ్రరూపం దాల్చినయో ఒక్కసారి అర్థంచేసుకోండ్లే. మొన్న మూడవనెంబరు సారాడిపోలో కాల్పులు జరిగినయి. అదృష్టవశాత్తు ఎవరికి గాయాలు తగలలేదు. అదే తాకేనుంటే పరిస్థితులు ఎట్లా ఉండేటివి? పోలీసుల గాలింపులు ఎక్కువైనయి ఇండ్లల్ల ఎవరుండకుండా పారిపోతున్నరు. ఇలా ఎంతకాలమని పారిపోదాం? రోజురోజుకు పరిస్థితులింకా తీవ్రరూపం దాల్చుతుంటే ఎవరు నిల్చుంటరు? దొరికినోల్లందర్ని అరెస్టులు చేస్తాండ్లు. ఇలా ఎంతకాలం కొనసాగిస్తాం. ఇప్పటికి మనం సాధించింది అల్పమైన విషయం ఏంకాదు. మనం మన ఐక్యతను ప్రదర్శించినం. ఇంకా ముందు ముందు మన మెన్నో పోరాటాలు చెయ్యాల్సి ఉంది. అందుకే ఎనకముందుకు ఆలోచించే ఈపని చేయటం జర్గింది. అతను ఇంకా ఏదో చెప్పటానికి నోరిప్పిండు. కాని అంతలోనే "చాల్లేవయ్యా చెప్పొచ్చినవు పోలీసోల్ల లాటీలుసూడంగనే పిచ్చలుడప్పులుకొట్టినయా? గటువంటోడివి గీ లొల్లిలకెందుకొచ్చినవు. అదెపాయె వచ్చినవె అనుకో నిన్నవడు అందరి తరపున వకాల్తా తీసుకొని ఒప్పందం చేసుకోమన్నడు. ఏదో పెద్ద సాధించి

కొచ్చినట్టు చెప్పుకొస్తానవు". మొఖమంత జేవురించుకపోతాంటే పొడుగుమొఖం కార్మికుడొకడు లేచి అడిగిండు.

'ఇది నేను ఒకన్నే చేసిందికాదు మనోల్లను విచారించె చేసిన' అదిగో పెద్ద మనిషి బాలయ్యను. గా రాయమల్లాని అడుగుండ్రి అందర్ని విచారించినోన్నిలేదో తెలుస్తది" అంటు వాళ్ళకేసి చెయ్యిపెట్టి సూయించిండు చలమయ్యసారు.

'నీకు విచారం చేయటానికి గీ తాగుబోతోల్లె దొరికిండ్లా" "వాని పెండ్లాం ఉచ్చుతాగకుంటె విదర్రి పడ్తలేదేమో తూ నీ తాగుబోతు పుట్టుకలనా......." అంటు కాండ్రికించిండొకడు.

"ఓరె ఐలిగా తొందరపడ్తె అయితావిరా ఆ సారు చెప్పిన దాంట్ల న్యాయ మున్నదిబిడ్డా. నిదానంగా ఆలోచించాలి మెల్లమెల్లగా పోవాలె కాని ఒక్కసారే పరుగుపెడ్తానంటే అయితావిరా" ముసలి బాలయ్య కూసున్నకాడి నుండి బదులు పలికిండు.

"తొందరపడి నిర్ణయాలు చేసిందెవరో తెలుస్తనే ఉన్నది లీటరుకు ఎనిమిది రూపాయలు పెర్గినకాడ ఒక్కరూపాయి తగ్గిస్తనమంటె సంకలు కొట్టుకుంటావచ్చి ఏదో పెద్ద పురుషత్తం చేసినట్టు చెప్పుకొచ్చిండ్లు చెప్పటానికి సిగ్గులేకున్నా వినటానికన్నా ఉండద్దు. ఇంకేమున్నది ఇక్కడలేండ్రి, లొల్లి ఆగేదిలేదు" బుజంమీది ఎర్రికండువాను దులుపుకుంటు చిటపటలాడుతు మందినుండి లేచిపోయిండతను.

ఆతర్వాత ఒక్కొక్కరే లేచిపోయిండ్లు చివరగా చలమయ్యసారు ఆయన చుట్టు మరో నల్గురు మిగిలిపోయిండ్లు. వెళ్ళిపోయినోళ్ళ దిక్కుచూస్తు "తొందరపుర్రి ఎగ్గులదాకన్నట్లు ఎగిరిపడ్తాండ్లు పదవియ్య వాళ్ళ మూతిపండ్లె ఇర్గపడ్తరు చెప్పంగ విననోన్ని చెడంగ చూడాలన్నరు. ఇటువంటోల్లను మస్తుగ చూసిన. ఇగో నా నెత్తిమీద వెంట్రుకలున్నంత మందిని చూసిన" ఇంకా ఏదో చెప్తునేఉన్నాడు.

అదేరోజు సాయంకాలము జనం మల్లి జమయిండ్లు. సారా పోరు ఆపాలనేటోల్లకు కాదు కొనసాగాలనేటోల్లకు వాగ్వివాదం జర్గింది. ముఖ్యంగా స్త్రీలు లొల్లిని 'ఆపనే ఆపద్దు' అన్నారు. బాగా కోపానికొచ్చిన స్త్రీ ఒకతె లొడలొడ

వాగుతుంది. "....సదువు చెప్పు మహారాజా అంటే దుడ్డె బర్రె నాది అన్నాడట ఎనకటికి ఎవడో, గాయన్నెవరు ఇండ్ల ఏలుబెట్టమన్నరు, ఏలుబెట్టినోడు ఉత్తగ ఊరుకోక అందరి తరపున వకల్తా ఎవరు పుచ్చుకొమ్మన్నరు. కూలిచేసిన కొత్తంతా కుక్కలు తాగినట్టు తాగబట్టిరి, పోరగాండ్లేమి తినాలి.... సారా ఇంట్ల మన్నుబొయ్య. పావలాపర్క తగ్గితె ఏమొస్తది అసలు సారా అమ్మకుంటనే చెయ్యాలి" ఆమె గొంతు అంతకంతకు జీరబోయింది.

ఒక్క క్షణం నిశ్శబ్దం ఆవరించింది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఓ యువకుడు మందిలకెల్లి ముందుకొచ్చిండు. "అందరం కల్సి ఒక్కతాటి ఉండాలంటిమి లొల్లి ముదిరిపాయె. జన్మకీడ్చిన ఆంబోతోల్గె పోలీసులు ఊరిమీదపడి కనబడ్డోల్లను పట్టుకబోయిరి. అగో గట్ల పట్టుకపోయినోల్లను కూడా విడిపించాలని లొల్లి చెయ్యాలె"

"అవునవును" కొందరప్రయత్నంగా అరిచిండ్లు.

అగో అటువంటి సమయం జనాన్ని పావుకంటు మళ్ళీ అదే బక్కపల్చటి యువకుడొచ్చిండు. అందరు ఒక్కక్షణం నిశ్శబ్దం అయ్యిండ్లు. అతను చెప్పటం మొదలుపెట్టిండు "కామ్రేడ్స్ మనం ఐక్యంగా సారా రేటు తగ్గాలనిచేస్తున్న మన పోరాటాన్ని అరెస్టులు, చిత్రహింసలద్వారా అణచలేమని గుర్తించిన ప్రభుత్వం మనదాంట్లో మనకే విరోధం పెట్టి మనకంట్లో మన వేలే పొడవటానికి మన ఐక్యత దెబ్బతీయటానికి ఓ కొత్తఎత్తు ఎత్తింది. దాంట్లో భాగంగానే మనవాళ్ళలో కొందరిని వేరుచేసి సారాతగ్గిస్తాం అంటు మాయమాటలు చెప్పి మోసంచేయాలని చూస్తున్నది ఒప్పందాలు అయినవి అంటాండ్లు. ఏమిటా ఒప్పందము లీటరుకు ఎనిమిది రూపాయలు పెంచటము వాళ్ళ ఇష్టమే పెంచినదాంట్లో భిక్షం వేసినట్టు ఒక రూపాయి తగ్గిస్తానం అని వాళ్ళంటె మనోళ్ళు సంకలు కొడతండ్లు ఇంతకుముందు ఒక తల్లి ఎంతో ఆవేదనతో పావలాపర్కా తగ్గిస్తే ఏమొస్తది మొత్తం సారాఅమ్మకుంట చేయాలన్నది. కాని ఈ దోపిడీ ప్రభుత్వం అందుకు సిద్ధంగాలేదు సరికదా ఏటేటికీఏడాది మరింత లాభాలు గుంజేందుకు ప్రయత్నిస్తుంది. గత సంవత్సరములోని ఎక్సైజ్ ఆదాయం 270కోట్ల నుండి 330 కోట్లకుపెంచింది. సారా కంట్రాక్టర్లు రోజురోజుకు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇవన్నీ

ఎక్కడనుంచి రావాలె? బాగెటోడే చెల్లించాలి తాళ్ళపన్ను అన్నట్టు ఇదిగో ఈ సారా తాగే కూలీనాలీలనుండే పిండుకోవాలి ఆ డబ్బంతా. అందుకే వాళ్ళు ఎన్నిఎత్తులు వేసినా అంతిమంగా మనల్ని దోపిడీ చేయటానికే. ఈ దోపిడి ప్రభుత్వాన్ని కూల్చేంతవరకు మనకు ఈ కష్టాలు తప్పవు. అందుకు మనమంత...." అంతలకే పోలీసులొచ్చిండ్లని కలకలం బయలుదేరింది. నాలుగు పానాదుల కమ్మేసికున్న పోలీసులు తుపాకులు బారుచేస్తు ముందుకు కగిలిండ్లు. జనానికి ఎటు కదలటానికి వీలులేకుండా అయింది. అగో గా బక్కపల్చని యువకున్ని కంటికి నదరువచ్చిన మరో ఆర్గురిని పట్టుకొన్నరు పోలీసులతోపాటే వచ్చిన సంజీవరావు మందిలో నన్ను కనిపెట్టి పోలీసులకు సైగచేసిండు. ఇద్దరు తుపాకులు పట్టుకున్న పోలీసులు వచ్చి పెనుగులాడుతుండగానే ఎత్తుకెళ్ళి వ్యానులో ఎక్కేసిండ్లు వ్యాను కదిలింది.

అలా అరెస్టుచేసి తీస్కపోయిన మమ్మల్నందరిని నాలుగురోజులదాక లాకప్పు లేసి పెయ్యిమీద పెద్ద కొత్త సందులేకుండా కొట్టిండ్లు. మోకాళ్ళ సందుల రోకల్లు పెట్టి కడుపుల పేగులు తెగిరాంగ కీన్యాడగొట్టిండ్లు. ఆ నాల్గురోజులు తీరొక్కబాధ పెట్టిండ్లు. నా జన్మలో నేనెప్పుడు అలా దెబ్బలు తినలే. దెబ్బలకు మూడురోజులు వొళ్ళంత నొప్పులతో నిప్పులు చెరిగేలా జ్వరమొచ్చింది. గోదావరిఖని డీఎస్పీ, సర్కిల్పి, సబ్ఇన్స్పెక్టర్లు కూర్చీలల్లో కూచుని ఒక్కొక్కరే యాష్టవచ్చేదాక వంతుల వారిగా కొట్టెటోళ్ళు. ఆరోజు అరెస్టు చేసినవాళ్ళలో మమ్మల్నందరిని కొట్టిందొక ఎత్తు. మాతోపాటు అరెస్టయిన ఆయువకుణ్ని కొట్టింది ఒకఎత్తు. నేను లాకప్పులో ఉన్న నాల్గు రోజులలో పన్నెండుసార్లు స్పృహ కోల్పోయిండు. ఇంటరాగేషన్కోసం అతన్ని కదల్చాలంటే పోలీసులు చేతులను డోలీలుపెట్టి మోసుక పోయేవారు. మళ్ళీ ఏదో అడిగేటోళ్లు. మళ్ళీ స్పృహకోల్పోయిన తర్వాత తిర్గి లాకపురూమ్లో పడేసె వారు. అతన్ని చూసెసరికి నా కడుపు తరుక్కుపోయేది వొళ్ళంత కోపంతో కుత కుతలాడేది.

ఐదోరోజు ఆ యువకున్ని మినహా మమ్మల్నందర్ని కోర్టుకు తీస్కపోయిండ్లు.

* * *

అదేదో అర్థం కాకుండా కోర్టు జవాను పిల్చిండు. 'పదండి పదండి' అంటు మాకు ఎస్కార్టుగా వచ్చిన పోలీసులు లాటీలు ఆడించుకుంటు నెట్టుకుంటు కోర్టు హాల్లోకి తోసుకుపోయిండ్లు.

కోర్టు హాల్లో జడ్జి సీట్ల కూచున్న నల్లకోటాయన ఎర్రటి బట్టతల మెరుస్తుంటె తెల్లకళ్ళద్దాల నుండీ మావైపు చూసిండు ఆయన నెత్తిమీద తెల్లకోక కప్పుకున్న గాంధి ఒకచేత కర్రపట్టుకొని మరోచేత లోకాన్ని దీవిస్తు ఎర్రనవ్వు నవ్వుతాండు. గా జడ్జిముందు కూసున్న గుమస్తా ఏవో కాగితాలు తీసి ఇచ్చిండు. ఆ గుమస్తాకు ఈవల గుండ్రటి టేబిల్‌చుట్టు నల్లకోటు కప్పుకున్న వకీలుసాబ్‌లు కూసున్నరు. గా వాళ్ళవెనుక పోలీసులు కూసున్నరు. వాళ్ళకు ఈవల గోడకానుకొని ఉన్న రెండు వరసల బెంచిలల్ల జనం కూసున్నరు గా జనంల చలమయ్యసారున్నడు. పోలీసోల్ల పక్క హన్మంతరావు, సంజీవరావు ఇంకా కొంతమంది సారా మాములాల్ల తిర్గటోల్లున్నరు. మేము ఏడ్గురం బోనులో నిల్చున్నము. మా పక్కన పారిపోకుండా పోలీసులు నిల్చున్నరు.

గవర్నమెంట్ వకీలుసాబొచ్చి జడ్జిగారితోని ఏదో ఇంగ్లీసుల చెప్పిండు, ఆయన మావైపు తిర్గి సన్నటి పెదాలవిప్పి "దొంగసారా తయారు చేస్తాండ్లనీ గవర్నమెంటు లైసన్సు ఉన్న సారా దుకాణంమీద దాడిచేసి అంతా ధ్వంసము చేసి లూటీ చేసారని, జనాన్ని రెచ్చగొట్టి అరాచకం సృష్టించారని మీమీద కేసు మోపబడింది. ఇది మీరు ఒప్పుకుంటున్నారా"

మా అందట్లోకి పెద్ద వయసున్న రాజీరు రెండు చేతులు జోడించి

"అంతా అబద్దం బాంచెను, దర్మప్రభువులు తమరె న్యాయం చెప్పెటోల్లు ఇగ్గో గీ ఈపు సూడండీ ఈ పోలీసోల్లు ఎట్ల గొడ్డును బాదినట్టు సావబాదిండ్లో" అంటు పెయ్యిమీద అంగి ఊడదీకిండు. పెయ్యంత కమిలిన గాయాలున్నాయి. మోకాలుమీది బట్ట ఎత్తి సూపించిండు. కండ్లపొంటి నీరుకారంగా దుఃఖంతో నోరు పూడుకపోయింది. "ఏం తప్పు చేసినమని బాంచెను మమ్మల్ని ఈతీర్గ కొట్టిండ్లు. అగో గక్కడున్న గా పోలీసాయన్ను అడుగుండ్లి కూలీనాలీ చేసుకునే బాంచెగాండ్లము వొల్లు తీపులు పెడ్తాంటె ఓ పావు వేసుకుంటె మత్తుగ నిద్రపడ్తదని గా సారా కొట్లకు పోతం. గా మాత్రం సుఖం లేకుండా సారా ధర పెంచిండ్లు. ఇగ అట్లయితె బతకలేం, సారాదర తగ్గేదాని సారాతాగమని మేమంతా అనుకున్నం అంతేబాంచెను అగో అట్ల అనుకొని సారాతాగుడు బందుచేసిన కాన్నుంచి మా ఇండ్లల్లకు పోలీసులొచ్చి పిల్లజెల్ల అనకుంట పట్టుకొచ్చి ఇగో గీతీర్గ కొట్టి మీ ముందు తీసుకొచ్చిండ్లు.

అంతకంటే మేం ఏ నేరము చేయలేదు బాంచెను" ఆ తర్వాత దుఃఖముతోటి అతని మాట పెగలలేదు.

నల్లకోటేసుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ కళ్ళద్దాలు సవరిచ్చుకుంటూ ముందు కొచ్చి "కోర్టులో అలా ఏడ్వకూడదు అడిగిందానికి సూటిగా చెప్పాలి. మీరు సారా కాసింది నిజమా కాదా? ఒక మాటలో చెప్పు...." అంటు నెమ్మదిగా అసలు విషయం రాబట్టేందుకు ప్రయత్నించిండు.

"అయ్యా మావోడు ఏదో వాని బాదంతా చెప్పుకొచ్చిండు. గీ సారేందో దొంగసారా కాసిండ్లాలేదో సూటిగా చెప్పంటాడు. గా పోలీసోల్లు లంజకొడుకుల్లారా సారా దుకాణంమీద దౌర్జన్యం చేస్తారా? అని మా ఈపులంత ఇత్తులుదీసి చింతపండు తీర్గ చేసిండ్లు. అయ్యా అది నిజమో కాదో తెల్సుకోవటానికి మావోడు అంగి ఇడ్చి పీపుచూయించిండు. ఆయనొక్కని ఈపె కాదుదొరా మా అందరి ఈపులు చూడండి పచ్చిపుండు తీర్గ ఎట్లయినయో, ఎవలు దౌర్జన్యం చేసిండ్లో తెలుస్తది." తాటిమట్ట తీర్గవంగి ఎంకులు ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలియక నోరు మూసుకున్నడు.

రాయలింగం అందుకుని 'అయ్యా నేను చానా ఏండ్లకాన్నుంచి సారా తాగుతానా మొన్న గీ లొల్లి అయినకాన్నుంచి తాగద్దు అనుకొని ఇగ సారాకొట్టు ముఖం సూల్లె. అగో అది కటరి పెట్టుకొని, అదిగో గా పోలీసాయన దగ్గరున్న మాములా దారు నన్ను పట్టించిండు." అంటు రాయలింగు ఇంకా ఏదో చెప్పబోయిండు కాని అతని మాటకు అడ్డుపోయి సమ్మయ్యా "గదంతా ఎందుకు కాని నన్ను చెప్పనియ్యి" అంటు ముందుకొచ్చిండు.

జడ్జి గురుగా చూస్తు "అతను చెప్పనియ్యి" అన్నాడు.

సమ్మయ్య వెనక్కి తగ్గిండు. కాని రాయలింగు "ఇక ఏం చెప్పేదిలేదు" అంటు చేతులు ఎత్తిపట్టి జోడిస్తూ దండంపెడ్తూ వెనక్కి జర్గిండు.

జడ్జి ఇక ఇప్పుడు చెప్పమన్నట్టుగా నిర్లక్ష్యంగా చూసిండు.

సమ్మయ్య కాస్త ముందుకు జర్గి, అందరి వైపోసారి చూసి, జడ్జి వైపు తిర్గి చెప్పటం మొదలుపెట్టిండు.

"మేము దొంగసారా కాసిన మంటాండ్లు అది మేం చేయలేదంటావం. కాని అచ్చంగా దొంగసారా కాసెటోళ్ళు హాయిగున్నరు. వాళ్లు అడిగో గా పోలీసోల్ల పక్కన కూచొని చోద్యం చూస్తున్నరు" అంటు ఏల్లెత్తి కంటాక్టర్లవై చూపించి మళ్ళీ మొదలుపెట్టింది.

"ఉత్త పుణ్యానికి మేం బోన్ల ఉన్నం. అగ్గో గా కొత్త మాములాదార్లు. మాములా తీసుకోకముందు మా ఇలాకాలో సారా పాట పన్నెండు లక్షలుండె దాన్ని ఈ సంవత్సరం, పద్దెనిమిది లక్షలకు పెంచి పాడిండ్లు. దాంతో చిన్న చాపలవంటి సారా కంటాక్టర్లు కొట్టుకపోయిండ్లు సరే అంత పాట పాడిన కంటాక్టరుకు గవర్నమెంటు సప్లయిచేసేకోటా ఎంతంటె నెలకు 5000 లీటర్లు, రు. 6-25 చొప్పున సప్లయి చేస్తది. ఇప్పుడున్న లెక్క పక్రకారమే సారా దర లీటరుకు రు. 40/- చొప్పున అమ్మినా కంటాక్టర్లకు లాభాలు అనుకున్నంతరావు. మరైతె కంట్రాక్టర్లు తాగెటోల్లకేమన్నా సేవచేసేందుకు కంకణం కట్టుకున్నారా?" అంటు పిల్లలకు పాటం చెపుతున్న పంతులుతీర్గ ఒక్కసారి కూచున్న జనంపై పుచూసి మళ్ళీ కొనసాగించింది. అందరు వింతగా నిశబ్దంగానె వింటున్నారు.

"ఏమిటి నువు మాట్లాడేది?" జడ్జి అన్నాడు.

"నిజమే సాబ్, మీకుకాక ఇంకెవరికి చెప్పాలె? గవర్నమెంటు సప్లయిచేసె 5000 లీటర్లు మా గోదావరిఖనిలోనె ఒక్కవారం రాదు. ఇక మిగతా మూడు వారాలు ఏం అమ్ముతడు. మా దగ్గరున్న 22 సారా కొట్టుల అన్ని కల్పి నెలకు 40.000 లీటర్ల సారా అమ్ముతరు. గవర్నమెంటు నెల కోటా పక్రకారం సప్లయిచేసే 5000 లీటర్లుపోతే, మిగతా 35,000 లీటర్లు ఎక్కడినుంచి వస్తయో ఆలోచించుండ్రి? నెలకు నలుబయివేల లీటర్లు అమ్మకుంటె మాములాదార్లకు కోట్లరూపాయలు లాబంవస్తది. మరి అంత సారా కావాలంటె దొంగ సారా కాయాల్సిందే. లేకుంటే అంత సారా ఎట్లా తయారయితది?" అని పశ్నార్థకంగా చూసి మళ్ళీగొంతెత్తింది. అది మరింత కరుకుగా తయారైంది.

"అగో గట్ల వేలకు వేల లీటర్లు దొంగసారా తెచ్చిఅమ్మెటోల్లు బాగానేఉన్నరు వాళ్లు అట్లా చేయకుంటే వాళ్ళకు లాభాలు రావన్న సంగతి సారా తాగే జనానికి

తెలియకున్నా గవర్నమెంటుకు మాత్రం తెలుసు. మరి అటువంటప్పుడు గవర్న మెంటు వారి ఎక్సయిజ్ శాఖ ఎందుకున్నదని అనుమానం రావచ్చు."

"ఆపు ఆపు" అన్నాడు జడ్జి కాని మావాడు అది గమనించకుండానే "ఎక్స యిజ్ శాఖ వాళ్ళు చట్ట విరుద్ధంగా దొంగసారా తయారు కాకుండా చూసెటోళ్ళు. కాని వాళ్ళకు ఆ మాములాదార్లు దొంగసారా తయారు చేస్తరన్నది తెల్వ. మరటు వంటప్పుడు పిల్లు చేసె పనేమిటంటె! దొంగలు దొంగలు ఊళ్లపంచుకున్న మాదిరి సారాతాగే కూలి జనం స్వంతానికి సారా కాసుకోకుంటా చూసటమే వాళ్ళపని. సారా తాగేజనం ఎవరికివారే సారాకాసుకొని తాగితే లక్షల రూపాయల పాట పాడిన మాములాదార్లు ఏం కావాలి? వాళ్ళద్వారా గవర్నమెంటుకు ట్రాజుల మీద వచ్చే కోట్లాది రూపాయలు ఏంకావాలి? అందుకోసం సారాతాగే జనమంత లైసెన్సు పొందిన సారా కంట్రాక్టర్లు తయారు చేసిన దొంగసారే తాగాలి కానీ ఎవరిసక్కి వాళ్ళు సారా కాసుకొని తాగద్దు. అలా జనం దొంగ సారా కాయకుండా చూసేందుకే ఎక్సయిజుశాఖ ఉంచి. ఈ ఎక్సయిజ్ వాళ్ళ వాళ్ళపనిని మరింత పకడ్బందీగా నిర్వ హించటానికి తుపాకులిస్తామని గా మధ్యన వచ్చిన ఎక్సయిజు శాఖ మంత్రి అన్నడు మంత్రి అంటె జ్ఞాపకానికొచ్చింది. అగో ఆయన గా మంత్రి పదవికి రాకముందు ఆయనో పెద్ద సారా మాములాదారే. ఆయన ఎలక్షన్లప్పుడు సారా కంట్రాక్టర్లంత డ్రమ్ములకొద్ది సారా ఉచితంగా పంచి గెలిపించిండ్లు. సారాతోనే పుట్టి సారా తోనే ఎదిగిన సారా మంత్రి ఆ మాత్రం వాళ్ళకు మేలు చేయకుంటే ఎవరికి చేస్తడు:" వ్యవహారంబాగానే ఉందన్నట్టు తలెగరేశాడు జడ్జి.

"సారా కంట్రాక్టరు, సారా పోసి ఓట్లు కాని సారా మంత్రియై పోవుడేంది? కూలి చేసుకునెటోడెవడన్న సంసారానికింత సారా కాసుకుంటె దొంగయి పోవుడేంది? అగ్గో అటు వంటి కూలి జనాన్ని పట్టుకొచ్చి సారా కంట్రాక్టర్లు వాళ్ళ స్వంత లాకప్పులో వేసి రోజుల తరబడి చిత్రహింసలు మాన భంగాలు చేసి దర్మ ప్రభువులు తమ ముందుకు తీస్కవస్తే తమరు వాళ్ళకు శిక్షలేసి జేళ్ళకు పంపుతరు. వేల లీటర్లు దొంగసారా కాసే మాములాదార్లు హాయిగుంటరు. అగో వాళ్ళకే గా ఎక్సయిజ్ ఇన్స్పెక్టర్లు పోలీసులు వంగి వంగి సలాములు చేస్తరు.

మీరు మాకుశిక్షలు వేస్తరు. పానంగాపాడే మందులకేమొ అల్కహాల్ లేదంటరు. పానాందీళ్ళ సారా చేశేటానికేమొ టాంకులకు టాంకులు సప్లయిజేస్తరు" అంటూ మా వోడు అపహాసంగా పలికిడు.

ఇన్నేల్లు సారాకొట్టులో పనిజేసినా గాని నాకు అంత వివరంగా అర్థంకాని సారా దోపిడిని, మా వోడు అంతవివరంగా తెలిపేసరికి నాకు ఆశ్చర్యం, ఆనందం కల్గింది. అభినందనగా ఆవేశం ఆగక అతని చేతినినొక్కాను.

అంతవరదాక ఎందుకో-మౌనంగా ఉన్న జడ్జిగారు ముఖం కోపంతో చిరు చిరు లాడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి "ఏయ్ మిస్టర్ అనవసర విషయాలను ప్రస్తావించక అడిగిన దానికి సూటిగా జవాబు చెప్పాలి" అంటు రెచ్చి పోయిండు.

మా వోనికి కోపం తారాస్థాయికి చేరింది ఆవేశంతో శరీరమంత పూగి పోతాంటే మళ్ళీ మాట్లాడ సాగిండు....

"అవునుసార్ మేం మాట్లాడవద్దు. మా చేతులకు తాళాలు వేసినట్టు మానోటికి కూడా తాళాలు వేయిండ్లి. అప్పుడిక మేం నోరుమూసుకుంటాం ఎవడన్న ఆకలై పిడికెడు మెతుకులు ఎత్తుకపోతే దొంగయిపోతాండు కాని వేల బస్తాలు బ్లాక్‌లో దాపి, అమ్మేసే షావుకారు పెద్దమనిషై పోతాండు. ఎవడన్నా పండుగకో పబ్బానికో సారా కాసుకుంటె దొంగయిపోతాండు. పబ్లిగ్గా దొంగ సారా అమ్మే కంట్రాక్టరు పెద్ద సేటయిపోతాండు. వాడే మంత్రిఅయి రాజ్యాన్ని ఏలుతండు. అంతా దొరల రాజ్యమైపోయింది.

జడ్జి అసహనంగా బల్లమీద సుత్తిమోగించాడు. కేసు వాయిదా వేస్తున్నట్టుగా ప్రకటించి పోలీసులవైపు చూసిండు. "ఇక వీళ్ళను తీస్కవెళ్లు" అన్నట్టుగా.

అంతవరదాకా గాండ్రుకప్పలాంటి మొఖంతో మావైపే క్రూరంగా చూస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశరావు దబదబ ముందుకు వచ్చి లాటీ ఆడించుకుంటు ఎడమచేత్తో మమ్మల్ని ముందుకు తోసిండు.

జైలు కటకటాల వెనుక మరో వాయిదాకోసం మేం నిరీక్షిస్తున్నాం.